


**ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం.. ప్రియుడితో జంప్‌కు యత్నం!**

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

సోమవారం | 28 జులై , 2025 | పేజీలు : 06

# గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డూ ఇవ్వలే

### ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్

### పోలేపల్లిలో నూతన రేషన్ కార్డుల పంపిణీ





**ప్రజాపక్షం/చందంపేట:** నల్లగొండ జిల్లా చందంపేట మండలం దేవరకొండ నియోజకవర్గంలో షెడ్యూల్ కులాలు, తెగలు, అల్పసంఖ్యాక వర్గాల ప్రజల సంక్షేమానికి తన వంతుగా ఎక్కువ నిధులు అందించి సహకరిస్తానని, నల్గొండ జిల్లా ఇంచార్జీ మంత్రి, రాష్ట్ర ఎస్సి, ఎస్టి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం దేవరకొండ నియోజకవర్గంలోని చందంపేట మండలం పోలేపల్లిల్లో లబ్దిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్‌ఏ బాలునాయక్ కోరిన విధంగా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి, రోడ్ల అభివృద్ధికి, ఎస్‌సి, ఎస్టి సబ్ ప్లాన్ నిధులు కేటాయించి తన వంతు సహకారాన్ని అందిస్తానని తెలిపారు. గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, అలాంటిది తమ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేదకు రేషన్ కార్డు ఇవ్వడం జరుగుతుందని, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రూ. 5లక్షలు,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు ఘనత తమదేఅని అన్నారు. తమ ప్రభుత్వంలో ఎస్టీ వర్గీకరణతో పాటు, బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌కు సిఫారస్ చేయడం జరిగిందని, ఎక్కడా లేని విధంగా కులగణన చేశామని, రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అమలు చేస్తున్న కార్యక్రమాలు పేదలకే చేరాలని తెలిపారు. తన మంత్రిత్వ శాఖల ద్వారా తప్పనిసరిగా నియోజకవర్గానికి ఎక్కవ నిధులను ఇచ్చేందుకు కృషి చేస్తానని మంత్రి తెలిపారు. అనంతరం ఎంఎల్‌ఏ బాలునాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని అందులో భాగంగానే నియోజకవర్గానికి ఇప్పటి వరకు కొత్తగా 11,736 రేషన్ కార్డులను ఇవ్వడం జరిగిందని, రేషన్ కార్డులలో 15,837 మందిని సభ్యులుగా చేర్చి వారందరికి సన్న బియ్యాన్ని ఇవ్వనున్నామని తెలిపారు. ఈ ప్రాంత చిరకాల వాంఛ అయిన ఎస్ఎల్‌బిసి, డిండి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని, ఇతర నియోజకవర్గాలతో సమానంగా దేవరకొండను అభివృద్ధి చేస్తానని తెలిపారు. దేవరకొండ నియోజకవర్గానికి ఎస్సి, ఎస్టి సబ్ ప్లాన్ నిధులు ఎక్కువ కేటాయించాలని, రహదారులు లేని తండాలకు రహదారులకు నిదులు మంజూరు చేయాలని, మైదాన ప్రాంతంలో ఐటిఏ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రిని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎంఎల్‌సి శంకర్ నాయక్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 1800కోట్లతో డిండి ప్రాజెక్టును చేపట్టడం జరిగిందని, దేవరకొండ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తామని, భూ భారతి, బిసి కులగణన చేపట్టామని, దేవరకొండ లాంటి వెనుకబడిన ప్రాంత అభివృద్ధికి అందరూ సహకారం అందించాలని కోరారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ రేషన్ కార్డులు నిరంతర ప్రక్రియ అని, చనిపోయిన వారి పేర్లను రేషన్ కార్డుల్లో నుండి తొలగించే విధంగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తెలపాలని కోరారు. సన్న బియ్యం పంపిని విషయంలో చౌకధరల దుకాణా డీలర్లు పారదర్శకంగా ఉండాలని, ఈ విషయంలో ఎలాంటి ఆరోపణలున్న తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. అన్ని ప్రభుత్వ పథకాలు పొందేందుకు ముఖ్యంగా హెల్త్ ఇన్సూరెన్స్ పథకాన్ని పొందేందుకు రేషన్ కార్డు తప్పనిసరి అని అన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 62,155 కొత్త రేషన్ కార్డులు జారీ చేశామని, అంతేకాక 80,201 మందిని రేషన్ కార్డులలో కొత్తగా సభ్యులుగా చేర్చడం జరిగిందని తెలిపారు? ఈకార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశం, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరీష్, గృహ నిర్మాణ శాఖ పీడి రాజ్‌కుమార్, గిరిజన సంక్షేమ అధికారి చత్రు, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, ఆర్డివో రమణారెడ్డి, తహశీల్దార్ శ్రీధర్‌బాబు, ఎంపిడివో లక్ష్మి , సాంఘీక సంక్షేమ శాఖ డిడి శైలజ పాల్గొన్నారు.

# నిర్లక్ష్యపు నీడలో అంబేద్కర్ విగ్రహం



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని కూడలిలో ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహం నిర్లక్ష్యపు నీడలో ఉన్నది. ప్రభుత్వాలు మారిన, అధికారులు మారిన కాని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎలాంటి మార్పు రాలేదు. గతంలో స్థానికంగా ఉన్న అధికారులను పలువురు ఎంఆర్‌పిఎస్ నాయకులు, అంబేద్కర్ వాదులు విగ్రహం ఉన్న కూడలిని సుందరీకరించాలని విజ్ఞప్తి చేసినప్పటికి అధికారులు కనీసం పట్టించుకోలేదు. గత ప్రభుత్వం పట్టణ ప్రగతి పేరుతో పట్టణాలను సుందరీకరించినప్పటికి కేవలం మునిసిపాలిటిలలో, జిల్లా పరిషత్‌లలో మాత్రమే అంబేద్కర్ విగ్రహాలను సుందరీకరించారు. మండల కేంద్రంలో ఉన్నటువంటి అంబేద్కర్ విగ్రహాన్ని అనేక మంది నాయకులు, మేధావులు ఎంతో వ్యయ ప్రయాసలకు లోనై అంబేద్కర్ విగ్రహాన్ని చాలా మంది దాతల సహకారంతో, అధికారుల అనుమతితో ఏర్పాటు చేశారు. కానీ ఇప్పుడు అంబేద్కర్ విగ్రహం వద్ద వివిధ పార్టీల నాయకులు వారి మీటింగ్‌లప్పుడు మాత్రమే అంబేద్కర్ గుర్తుకు వచ్చి ఒక్క పూలమాల వేసి చేతులు దులుపుకుంటున్నారే తప్పా విగ్రహం చుట్టు పక్కల ఎలాంటి అభివృద్ధికి తోడ్‌పడకపోవడం విడ్డూరం. నాయకులు విగ్రహం చుట్టూ పార్టీ మీటింగ్‌లప్పుడు, పుట్టిన రోజులప్పుడు వారి ప్లెక్సీలు, పోస్టర్లు, బ్యానర్లు కట్టుకుంటున్నారే తప్పా భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహం వద్ద కనీస అభివృద్ధికి వారికి చేతులు రావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భారత రాజ్యాంగ నిర్మాత డా. బిఆర్ అంబేద్కర్ పట్ల ఉన్న ప్రేమను చాటుకొని విగ్రహం చుట్టుపక్కల మొక్కలు, గడ్డిని నాటి పచ్చదనంగా ఉంచాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు, దళిత సంఘాల నాయకులు కోరుతున్నారు.

**ఏదుళ్ల ఎల్లయ్య ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడు:** డా. బిఆర్ అంబేద్కర్ విగ్రహం చుట్టూ ఎలాంటి ప్లెక్సీ, బ్యానర్లు ఏర్పాటు చేయకుండా గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

**ఎర్ర కృష్ణ జాంభవ్ డివైజేఏసి రాష్ట్ర చైర్మన్:** డా. బిఆర్ అంబేద్కర్ విగ్రహం చుట్టూ అధికారులు పచ్చని పూలమొక్కలతో అలంకరించి, రాత్రి వేళలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి, విగ్రహాన్ని సుందరీకరించాలి.



## మంత్రి లక్ష్మణ్‌కు స్వాగతం

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** దేవరకొండలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి హైదారాబాద్ నుండి దేవరకొండకు వెళుతున్న నల్గొండ జిల్లా ఇంచార్జ్ మంత్రి, ఎస్సీ, ఎస్టి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్‌కు కొండమల్లేపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఊట్కూరి వేమన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. మంత్రికి పుష్పగుచ్ఛాలు ఇచ్చి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ గంధం సురేష్, కోట్ల జగదీష్‌పటేల్, మైనార్టీ నాయకులు మౌలానా నజీర్, మాజీ ఎంపిటిసి జగన్,లాలు నాయక్, మాజీ సర్పంచ్‌లు గడ్డం శ్రీరాములు, రవినాయక్, బొడిగె శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.



## బిఆర్ఎస్‌వి నాయకుడికి జన్మదిన శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలోని నీర్నెముల గ్రామానికి చెందిన నియోజకవర్గ బీఆర్ఎస్‌వీ నాయకుడు చిన్నపాక రమేష్ తన జన్మదినం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య నార్కట్‌పల్లిలోని ఆయన నివాసం వద్ద కలిసి ఆశీర్వాదం చేసుకున్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి ఆయనతో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.

## జాతీయ ఒబిసి మహాసభను విజయవంతం చేయండి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** దేశంలో మొదటిసారిగా ఓబీసీ రిజర్వేషన్లను ఆగస్టు 7వ తేదీన అమలు చేస్తున్నట్లు ప్రకటించిన సందర్భంగా గోవా రాష్ట్రంలో పెద్ద ఎత్తున అఖిల భారత మహాసభను నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ అన్నారు. గోవా యూనివర్సిటీలో జరిగే మహాసభ గోడపత్రికను ఆయన ఆదివారం పట్టణంలో విడుదల చేసి మాట్లాడారు. బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో మేమెంతో మాకంత వాటా దక్కాలని, దేశ వ్యాప్తంగా తక్షణమే బీసీ కులగణన నిర్వహించాలని జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో బీసీల రిజర్వేషన్లు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ విష్ణు దేవ్‌వర్మకు పంపించిన ఆర్డినెన్స్‌ను గవర్నర్ సానుకూల దృక్పదంతో నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి దుర్గయ్య, దొనేటి శేఖర్, మహేష్, హరి, నవీన్, ఆదిత్య, శివశంకర్, నాగరాజు, చంటి, అంజి, రాజు, లోకేష్, అఖిల్, శివ, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ‘స్థానిక’ ఎన్నికల్లో బిజెపి జెండా ఎగురవేయాలి



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** కేంద్ర ప్రభుత్వం అందచేస్తున్న సంక్షేమ పథకాలు గడప గడపకు చేరవేస్తే రానున్న రోజుల్లో స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని బీజేపీ రాష్ట్ర నాయకులు సుర్వి శ్రీనివాస్ అన్నారు. తుర్కపల్లి మండల కేంద్రంలో జిల్లా భారతీయ జనతా పార్టీ పిలుపుమేరకు ఏర్పాటు చేసిన స్థానిక సంస్థల ఎన్నికల కార్యశాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎంపీటీసీ, జడ్పిటిసి, సర్పంచ్ ఎన్నికల్లో ప్రతి ఒక్క స్థానంలో పోటీ చేసే విధంగా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. మండలంలో కాంగ్రెస్ టిఆర్ఎస్ పార్టీల కన్నా, భారతీయ జనతా పార్టీలో అధిక సంఖ్య యువకార్యకర్తలు బలంగా ఉన్నారని, గ్రామ పంచాయతీకీ వచ్చే కేంద్ర ప్రభుత్వ పథకాలను గడప గడపకు చేరవేస్తే 10 ఎంపిటిసి స్థానాలలో 8 స్థానాలు, ఒక జడ్పీటీసీ బిజెపి పార్టీ కైవసం చేసుకుని ఎంపీపీగా గెలిచి తుర్కపల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ జండా పాతాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు మేకల శ్రీనివాస్, నాయకులు యాట పెంటయ్య, కొక్కొండ లక్ష్మీనారాయణ, నరేంద్రనాయక్,ఆకుల రమేష్, సైదులు చాంద్ పాషా, జక్కుల వెంకటేశం శంకర్ నాయక్,భీమరి కుమార్,ఏదుముల ఆంజనేయులు చల్మయ్య పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడం సరైంది కాదు



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** తెలంగాణ రాష్ట్రంర్లని లంబాడిలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలని సుప్రీంకోర్టులో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, మాజీ ఎంపి సోయం బాబురావులు ఫిటిషన్ వేయడం సరైంది కాదని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లూనావత్ పాండునాయక్, జిల్లా అధ్యక్షులు నాగునాయక్ లు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 1976 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జిల్లాలోని ఎస్టీలుగా ఉన్న లంబాడీలు, సుగాలీలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలని పిటిషన్ దాఖలు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అన్ని రంగాల్లో వెనుకబడిన లంబాడీల అభివృద్దిని ఆకాంక్షిస్తూ నాటి ప్రధాని ఇందిరగాంధీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని లంబాడిలను ఎస్టీలుగా గుర్తించారని గుర్తు చేశారు. ఎస్టీ జాబితాలోని అన్ని ఉపకులాల అభివృద్దిని లంబాడీలు కాంక్షిస్తుంటే వారిని జాబితా నుండి తొలగించాలని చెప్పడం హేయమైందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అసలైన గిరిజనులు లంబాడిలేనని అన్నారు. ఇప్పటికైనా వారు సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌ను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పొరియానాయక్, ధరావత్ సోమ్లానాయక్, గుగులోతు వీరన్ననాయక్, సాయినాయక్, పవన్‌నాయక్, కళ్యాణ్‌నాయక్ పాల్గొన్నారు.

## ఉస్మానియా యూనివర్శిటీ నుండి డాక్టరేట్ పట్టా



**ప్రజాపక్షం/సూర్యాపేటరూరల్:** సూర్యాపేట మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు పిల్లలమర్రి కి చెందిన తుపాకుల భూషయ్య రాములమ్మల కుమారుడు తుపాకుల శ్రీను మధుమేహంతో బాధపడుతున్న రోగుల్లో గుండె సంబంధిత వ్యాధులైన డయాబెటిక్ కార్డియోమయోపథికి ప్రత్యామ్నయ చికిత్సలను కనుగొనే దిశలో గుండె రుగ్మతల నివారణలో ఔషద సస్యాల పాత్రపై డా.రాజు పాడియా పర్యవేక్షణలో విస్తృత పరిశోధనలు చేసి పలు జాతీయ అంతర్జాతీయ జర్నల్స్ ప్రచురితం చేసి సదస్సులో ప్రసంగించినందుకు ఉస్మానియా యూనివర్శిటి డాక్టరేట్ పట్టాను అందజేసింది. ఈ పరిశోధన ఫలితాల వల్ల భవిష్యత్‌లో సహజమైన దుష్ప్రభావాలు లేని చికిత్స మార్గాల రూపకల్పనతో గుండె సంబంధిత రోగులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఓయు తెలిపింది. చిన్ననాటి నుండే శ్రీనివాస్ పల్లెల్లో పేదలకు ఆరోగ్యమైన జీవితం ఇవ్వడం కోసం ఏదో ఒకటి చేయాలన్న తపన. తనని ఉన్నత చదువులు చదివేలా ముందుకు నడిపి పిల్లలమర్రి స్కూల్‌లో మొదలైన విద్యాభ్యాసం పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్శిటి నుండి పీజి విద్యను అభ్యసించి ఉస్మానియా యూనివర్శిటిలో పిహెచ్‌డి సాధించేలా చేసింది. శ్రీనివాస్ చేసిన పరిశోధనలకు డాక్టరేట్ పట్టా పొందినందుకు మిత్రులు, ఉస్మానియా అభినందించారు.

## యువతకు అబ్దుల్ కలాం ఆదర్శప్రాయుడు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఏపీజే అబ్దుల్ కలాం నేటి యువతకు ఆదర్శప్రాయుడని సామాజికవేత్త జె.రాజు, బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ్‌నాయక్, బీసీ జేఏసీ కోకన్వీనర్ చేగొండి మురళీయాదవ్, దాసరాజు జయరాజులు అన్నారు. ఆదివారం అబ్దుల్‌కలాం వర్ధంతి సందర్భగా స్థానిక మేరెడ్డి రాంచంద్రారెడ్డి గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారు మాట్లాడారు. ప్రపంచ మేధావిగా, మిస్సైన్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా అనేక రకాల అత్యాధునీక టెక్నాలజి కలిగిన అయుధాలను తయారు చేసి దేశానికి అందించారని అన్నారు. కార్యక్రమంలో జక్క నాగేశ్వర్‌రావు, నేతినేతి వెంకన్న, శ్రీను, దుర్గయ్య, అనిల్, సునీల్, సైదులు, రవి, శివ, చరణ్‌రెడ్డి, సతీష్, వినయ్ పాల్గొన్నారు.






## బిసి రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** బీసీ రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం తీర్మాణం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించినా నేటికి బీసీల రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదన్నారు. జనాభాలో సగభాగమైన బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని అనేక ఉద్యమాలు చేస్తే తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మాణం చేసి కేంద్రానికి పంపినా కూడా కేంద్ర ప్రభుత్వం అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నా. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే తెలంగాణాలో బీసీలు పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. దాసరాజు జయరాజు, చేగొండి మురళీయాదవ్, గంగాధర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎంకు కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని యవజన కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిపై కౌశిక్‌రెడ్డి చేసిన అసత్య నిరాధారమైన ఆరోపణలపై కేసు నమోదు చేయాలని టూటౌన్ సీఐకి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎంను విమర్శించే స్థాయి కౌశిక్‌రెడ్డి లేదన్నారు. పదేండ్లలో జరగని అభివృద్ధి 18నెలల్లో జరగడాన్ని చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. సీఎం రేవంతరెడ్డికి క్షమాపణలు చెప్పని పక్షంలో కౌశిక్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఫిర్యాదు చేసిన వారిలో యువజన కాంగ్రెస్ నాయకులు అజారుద్దిన్, పర్వేజ్ ఖాన్, అజయ్, నాగునాయక్, సల్మాన్, సతీష్‌నాయుడు, సురేష్, అశోక్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

## పేదల అభివృద్ధి కాంగ్రెస్‌కే సాధ్యం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పేదవర్గాల సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు తిప్పన రవీందర్‌రెడ్డి అన్నారు. 18 నెలల పాలనలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల ప్రాముఖ్యతను మండలంలోని సుబ్బారెడ్డిగూడెం ఇంటింటికి వెళ్లి ఆదివారం వివరించారు. అనంతరం సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు చరిత్రలో పదిలంగా నిలిచిపోతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చిరెడ్డి, శేఖర్, మంద సైదులు, రవి, ప్రభాకర్, లలిత, తిరుపతయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఇందిరమ్మ ఇల్లు

**ప్రజాపక్షం/చివ్వేంల:** అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కొంగల సతీష్‌మాదిగ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల ఎంపిక ఇందిరమ్మ కమిటిలో ఉన్న నేతలు తమకు అనుకూలంగా ఉన్న వారికి ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారుల ఎంపిక చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందకుండా తమ అనుయాయులకు ఇల్లు, భూమి, భర్తలేని నిరుపేదలనే కనికరం లేకుండా అనర్హులను ఎంపిక చేస్తున్నారని తెలిపారు.



## మహేశ్వరి భౌతిక కాయానికి నివాళులు

**ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి:** గుడిపల్లి మండలంలోని చిలకమర్రి మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ కుమార్తె మహేశ్వరి మరణించిన విషయం తెలుసుకొని దేవరకొండ శాసనసభ్యుడు నేనావత్ బాలు నాయక్ ఆదివారం భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియచేశారు.ఆయన వెంట మాజీ ఎంపీపీ ప్రతాప్ రెడ్డి,యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు ముచ్చర్ల ఏడుకొండల యాదవ్,యువ నాయకులు ముచ్చర్ల శ్రీకాంత్ యాదవ్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలకృష్ణ,నాయకులు వేమన్ రెడ్డి, వెంకటేశ్వర్లు,పెద్ది శెట్టి సుధాకర్, నీలం శ్రీనివాస్ యాదవ్, నారాయణ తదితరులు ఉన్నారు.

## బిజెపి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



**ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి:** స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని అన్ని స్థానాలలో బిజెపి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వలసాని రామలింగం నాయకులు గుండాల అంజయ్య అన్నారు.ఆదివారం మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద మండల ఎన్నికల సన్నహాకు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని జెడ్పిటిసి తో పాటు అన్ని ఎంపిటీసీ స్థానాలలో గెలుపే లక్ష్యంగా అన్ని గ్రామాలలోని నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ వంగాల ప్రతాప్ రెడ్డి,సీనియర్ నాయకులు మలిగిరెడ్డి వెంకట్ రెడ్డి,మండల ప్రధాన కార్యదర్శి అంతి రెడ్డి,కార్యదర్శి గోవిందు,నాయకులు గూండాల శ్రీను,ఆంజనేయులు,తిరుపతి తదితరులు ఉన్నారు.

## కలాం సేవలు చిరస్మరణీయం

**ప్రజాపక్షం/కోదాడ:** భారతదేశ శాస్త్ర సాంకేతిక రంగాలకు విశిష్ట సేవలు అందించి దేశం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహనీయుడు డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం అని కోదాడ మండల విద్యాధికారి సలీంషరీఫ్ అన్నారు. ఆదివారం కలాం వర్ధంతి సందర్భంగా విజయిభవ ట్రస్టు, స్వర్ణభారతి ట్రస్టు, ఇరుకుళ్ల పౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీపార్కులో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పైడిమర్రి వెంకటనారాయణ, ట్రస్టు సభ్యులు చారుగండ్ల రాజశేఖర్, యాదా సుధాకర్, పందిరి సత్యనారాయణ, వెంపటి వెంకటనారాయణ, వెంపటి ప్రసాద్, బండారు శ్రీనివాసరావు, గునుగుంట్ల సాయి, పత్తి నరేందర్, మహాంకాశి సత్యనారాయణ పాల్గొన్నారు.



# సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తం

**ప్రజాపక్షం/చండూరు:** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ అప్రమత్తంగా ఉండాలని బిజెపి మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు పందుల సత్యంగౌడ్ , మండల పార్టీ అధ్యక్షుడు ముదిగొండ ఆంజనేయులు ప్రజలకు సూచించారు. చండూరు మున్సిపాలిటీ పరిధిలోని లక్కినేనిగూడెం లో డ్రైనేజీ మరియు మంచి నీటి ట్యాంకుల వద్ద మురుగు నీరు చేరి దుర్వాసన వస్తూ దోమలు వ్యాపిస్తున్న కారణంగా ఆదివారం బిజెపి నాయకులు అక్కడి పరిసరాలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున మున్సిపల్ అధికారులు , ప్రభుత్వ వైద్యులు ముందు జాగ్రత చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డులలో తక్షణమే దోమల



నివారణ చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ కమీషనర్ వార్డు ఆఫీసర్లకు ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పందుల సత్యం గౌడ్, ముదిగొండ ఆంజనేయులు , భూతరాజు స్వామి, సామ వెంకట్‌రెడ్డి, కారింగు శంకరయ్య , కారింగు రాజు, చొప్పరి సత్తయ్య , పిట్ట ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నో..డ్రగ్స్..సేవ్ లైఫ్...



**ప్రజాపక్షం/నందికొండ:** అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ లో ఆదివారం మత్తు పదార్థాలు మాదకద్రవ్యాల బారిన పడి తమ జీవితాలను సర్వనాశనం చేసుకుంటున్న యువతకు సందేశాలతో కనువిప్పు కలిగిస్తూ మత్తు రహిత సమాజ స్థాపన కోసంతన వంతు కృషి చేస్తున్నట్లు సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరంట్ల ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు గా పనిచేస్తున్న రాచకొండ ప్రభాకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరలు, ఉత్సవాలు, వారాంత సంతలలో,రద్దీగా ఉన్న ప్రాంతాలలో సెలవు రోజులలో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ట్లు అయన అన్నారు మద్యపానం ధూమపానం ఆరోగ్యానికి హానికరం నో డ్రగ్స్ సేవ్ లైఫ్ అంటూ కరపత్రాలు పంచుతూ చేతిలో మైకు పట్టుకుని ఫ్లెక్సీతో విచిత్ర వేషధారణతో ప్రచారం నిర్వహిస్తున్నారు.ఉపాధ్యాయుడుగా తమ వృత్తి ధర్మాన్ని నిర్వహిస్తూ సెలవు రోజుల్లో మత్తు పదార్థాలపై కార్యక్రమం చేపడుతూ నాగార్జునసాగర్ లో యువతకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించాడు ఇప్పటివరకు 150 పైగా కార్యక్రమాలు చేపట్టినట్లు అయన అన్నారు.నిస్వార్థంగా సమాజ సేవ చేయడం పట్ల స్థానికులు అతనిని అభినందించారు.

# కుమ్మర్లు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

**ప్రజాపక్షం/చౌటుప్పల్** : కుమ్మర్లు ఆర్థికంగా, విద్య, వైద్య, రాజకీయ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కుమ్మర సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కన్వీనర్ దరిపల్లి ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం కో కన్వీనర్ గోపాల్ ఇతర సభ్యులతో చౌటుప్పల్ మండలం నూతన కమిటీ ఏర్పాటు కోసం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి దేవాలయాల్లో కుమ్మర్లను పూజారిగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. కుమ్మర్లను కులం బీసీబి నుండి బీసీఏలో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుమ్మర్లకు పింఛన్లు అందించాలని కోరారు. కుండలు తయారు చేసే మట్టిని ఉచితంగా వారికి అందించాలని కోరారు. నూతన కమిటీ ఏర్పాటును శుక్రవారం ఆగస్ట్ ఒకటో తారీకు చౌటుప్పల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తా



మని తెలిపారు. అధిక సంఖ్యలో చౌటుప్పల్ మండల కేంద్రంలోని వివిధ గ్రామాల కుల పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కమిటీ లో సభ్యులుగా కొనసాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాడూరి ఆంజనేయులు, చినగారి బలరాం, సత్యనారాయణ, గుమ్మడల్లి భాస్కర్, సిలివేరు శ్రీనివాస్, చిన్న కొండూరు మాజీ ఉప సర్పంచ్ తీగుళ్ళ చంద్రయ్య, తీగుళ్ల నరసింహ, సిలివేరు వెంకటేశం పాల్గొన్నారు.

# గ్రామీణ క్రీడలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** గ్రామీణ ప్రాంతాలలో మరుగున పడిపోతున్న గ్రామీణ క్రీడాఐన కబడ్డీ క్రీడాకారులను వెలుగులోకి తీసుకవచ్చి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొనే విధంగా సూర్యాపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ వారు ముందుండాలని వ్యవసాయమార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జనగాం క్రాస్‌రోడ్డు వద్ద గల ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కబడ్డీ క్రీడాకారుల భవిష్యత్ కార్యచరణ సమావేశానికి ఆయన హాజరై ప్రసగించారు. గ్రామీణ క్రీడా అయిన కబడ్డీలో రాణించి ఎంతోమంది క్రీడాకారులు ప్రభుత్వ, ప్రైవేట్ రాజకీయ రంగాల్లో స్థిరపడ్డారని అదే విధంగా ప్రస్తుతం కనుమరుగవుతున్న ఈ కబడ్డీ క్రీడను అసోసియేషన్ సభ్యులంతా గ్రామీణ క్రీడాకారులను వెలికితీసి ఉన్నత స్థాయిలో ఉంచాలని, దానికి అన్ని విధాల సహకరిస్తానని హామీ ఇచ్చారు. కబడ్డీ అసోసియేషన్‌లో నెలకొన్న సమస్యలపై జిల్లా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మీ సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. అందుకు తాను వ్యక్తిగతంగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. అనంతరం కబడ్డీ క్రీడాకారులు అందరు కలిసి చైర్మన్ కొప్పుల వేణారెడ్డిని గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ క్రీడాకారులు రామచందర్‌గౌడ్, రామసాని రమేష్‌నాయుడు, గాజుల యాదగిరి, వెంకట రమణచారి, గుడిపాటి సైదులు, లాల్ మజార్, రవీందర్‌రెడ్డి, నాగిరెడ్డి, ఇమామ్, వీరయ్య పాల్గొన్నారు.



## శ్రీచైతన్య హైస్కూల్‌లో ఆత్మీయ సమ్మేళనం

**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండల కేంద్రంలోని శ్రీచైతన్య హైస్కూల్‌లో 2005/06 పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని జనంపల్లి శివారులోని అమృతవనంలో ఆదివారం నిర్వహించారు. విద్యార్థులు తమ పాఠశాల అనుభవాలను పంచుకున్నారు. విద్యాభోదన చేసిన గురువులను మణి, నరేందర్‌రెడ్డి, ఇంతియాజ్, లింగయ్య, మురళి, ఉమామహేశ్వర్‌ల ను సన్మానించారు. విద్యార్థులు రమేష్, మధు, నర్సిరెడ్డి, సాయి, మ హేష్, గోవర్ధన్‌రెడ్డి, విక్రమ్, రాజశేఖర్, శివ, సురేష్, సోమరాజ్, నవీన్‌రెడ్డి, శృతి, స్వాతి, విజయలక్ష్మి , చంద్రిక, స్వప్న పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ప్రతిఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షిస్తూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని హుజూర్‌నగర్ మున్సిపల్ పరిధిలోని నాలుగవ వార్డు మాజీ కౌన్సిలర్ ఓరుగంటి నాగేశ్వరరావు,వందేమాతరం ఫౌండేషన్ సభ్యులు ఆయుష్ యోగా శిక్షకులు బేతం రామాంజి రెడ్డి అన్నారు. ఆదివారం మాజీ రాష్ట్ర పతి అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా హుజూర్‌నగర్‌లోని 28 వార్డులల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఒక మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. రోజురోజుకు క్షీణించిపోతున్న పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భానోతు ప్రసాద్,చందా ప్రసాద్,ఓరుగంటి రాజ్యలక్ష్మి ,నూకల లక్ష్మి ,మట్టపల్లి రజిత,ఓరుగంటి హైమారాణి,సావిత్రి,జానకి తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 10న బోనాల పండుగ

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** జిల్లా కేంద్రంలోని శ్రీకృష్ణ టాకీస్ సమీపంలో ఉన్న ఊర ముత్యాలమ్మ దేవాలయంలో ఆగస్టు 10న ఆదివారం ఊర ముత్యాలమ్మ వారి బోనాల పండుగను నిర్వహించనున్నామని దేవాలయ కమిటి వారు పేర్కొన్నారు.ఆ దివారం స్థానిక ముత్యాలమ్మ దేవాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటి బాధ్యులు మాట్లాడారు. శ్రావణమాసంలో బోనాల పండుగ జరపడం ఆనవాయితీగా వస్తుందని, అందుకే పెద్దలంతా చర్చించి బోనాల పండుగ తేదీని నిర్ణయించడం జరిగిందని తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుకుంటూ బోనాల పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఎంతో ప్రసిద్ధి చెందిన కృష్ణ టాకీస్ వద్దగల ఊర ముత్యాలమ్మ దేవాలయానికి ప్రజలు అధిక సంఖ్యలో బోనాలతో వస్తారని, ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని కమిటి వారు తెలిపారు.



# ఆగస్టు 16న పెద్దమ్మ తల్లి, 17న గ్రామ దేవతల బోనాలు

## భువనగిరి ముదిరాజ్ బోనాల ఉత్సవ కమిటీ నిర్ణయం



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : భువనగిరి మున్సిపల్ పరిధిలో ఈనెల 16న శ్రీ పెద్దమ్మ తల్లికి, 17న ఆయా వార్డులలో ఉన్న గ్రామ దేవతలకు బోనాలు సమర్పించాలని ముదిరాజ్ బోనాల ఉత్సవ కమిటీ నిర్ణయించింది. ఆదివారం స్థానిక కిసాన్ నగర్‌లోని శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయ సమీపంలో ముదిరాజ్ బోనాల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వివిధ వార్డుల ముదిరాజ్ పెద్ద మనుషులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో ముదిరాజు బోనాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. భువనగిరి మున్సిపల్ పరిధిలోని వార్డులు, గ్రామాల వారు ఆగస్టు 16న పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. బోనాల సందర్భంగా పట్టణంలోని గ్రామదేవతల గుడుల వద్ద ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారిశుధ్య పనులను చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ను విజ్ఞప్తి చేశారు. ముదిరాజ్ కుల పెద్దల ఆధ్వర్యంలో బోనం పెద్దమ్మ తల్లికి శనివారం ఉదయం ఏడు గంటలకు సమర్పిస్తామని తెలిపారు. బోనాల సందర్భంగా బోనాల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ అలంకరణ, భక్తులకు ఉచితంగా ప్రసాదం, మంచినీరు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 16న ప్రత్యేక పూజలు తో బోనాల సమర్పణ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ముదిరాజులతోపాటు ఇతర ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశం లో నాయకులు కొలుపుల వివేకానంద, గపెంట నరసింహ, కుక్కదూగ సోమయ్య, కనక బాలకృష్ణ, గోరెంకల శివశంకర్, సాధు విజయకుమార్, గుర్రాల శివ నాగేందర్, బీస్కుంట్ల సత్యనారాయణ, ఎనబోయిన జహంగీర్, నీల శ్రీనివాస్, ఈర్ల వెంకటేష్, తుపాకుల సురేష్, శాగంటి నర్సింహా, మేడ బోయిన రాము, ఉడుత రమేష్, మంద బాబు, మంద నర్సింగ్ పాల్గొన్నారు.



## ప్రజా పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత

**ప్రజాపక్షం/దేవరకొండ:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పనిచేస్తుందని రాష్ట్ర ఎస్సి, ఎస్టి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఆదివారం దేవరకొండ పట్టణంలోని అవుసలి బజార్‌లో టీయూఎఫ్ఐడిసి నిధుల నుండి మంజూరు అయిన రూ. 1.35కోట్ల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో కుటుంబ పాలనకు ప్రాధాన్యత ఇస్తే కాంగ్రెస్ ప్రజా పాలనలో సబ్బండా వర్గాల సంక్షేమ పాలన అందిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఎంఎల్‌ఎ బాలునాయక్, ఎంఎల్‌సి శంకర్‌నాయక్, మార్కెట్ కమిటి చైర్మన్ జమున మాధవరెడ్డి, మునిసిపల్ కమిషనర్ సుదర్శన్, పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, ఈఈ మనోహర, మాజీ చైర్మన్ నర్సింహా, మాజీ వైస్ చైర్మన్ రహత్‌అలి, మాజీ కౌన్సిలర్లు, ఏఈ రాజు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, మునిసిపల్ అధికారులు, వార్డు ఆఫీసర్‌లు పాల్గొన్నారు.

## నేటి పోలీస్‘ గ్రీవెన్స్ డే’ రద్దు

**ప్రజా పక్షం/నల్లగొండ టౌన్:** ప్రతి సోమవారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే గ్రీవేన్స్ డే కార్యక్రమానికి ఈ సోమవారం జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ అందుబాటులో ఉండకపోవడం కారణంగా రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పాఠశాలలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై యాజమాన్యాలతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాంమని పేరెంట్స్ కమిటీ పట్టణ అధ్యక్ష,కార్యదర్శులు దార్ల రాజు, చిటికెల బాబు రావు లు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని రామగిరిలో గల ఆల్ఫా ప్రైవేట్ పాఠశాలలో నూతన పేరెంట్స్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దార్ల రాజు, ఉపాధ్యక్షుడిగా చిటికెల బాబురావు, ప్రధాన కార్యదర్శిగా పోలేని సంజీవ, గౌరవ సలహాదారులుగా బండారు శంకర్,బొజ్జ నాగరాజు, శ్రావణ్,ఉదయ్,నరసింహ,కత్తుల శివ, సతీష్, నవీన్, పురుషోత్తం, రాజేష్ లని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఇలాంటి సమస్యలు ఎదురైనా యాజమాన్యాలతో మాట్లాడి సమస్యలు పరిష్కరించే విధంగా పనిచేస్తామన్నారు. ఇందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఐక్యమత్యంతో సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కూల్ పేరెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

## నేత్రదానానికి అనూహ్య స్పందన



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** :పట్టణంలోని గంధం వారి గూడెం రోడ్డు ప్రాంతానికి చెందిన బండారు ధనమ్మ(82)ఆదివారం స్వర్గస్తులైనారు. విషయము తెలిసిన వెంటనే వీరి కుమారుడు బండారు నరసింహ మిట్టపల్లి అశోక్ లను లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ డైమండ్స్ జోన్ చైర్మన్ కక్కిరేణి శ్రీనివాస్ సంప్రదించి, నేత్రదానం విశిష్టతను దాని యొక్క ఆవశ్యకతను వివరించగా వీరి అంగీకారంతో లయన్స్ క్లబ్ చారిటబుల్ ట్రస్ట్ ఐ డొనేషన్ సెంటర్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ చిరునోముల, టెక్నీషియన్ బచ్చలకూర జాని, మేనేజర్ డాక్టర్ పుల్లారావు ఆధ్వర్యంలో నేత్రదాన సేకరణ జరిగినది. కుటుంబ సభ్యులను కోల్పోవడం ఎంతో బాధాకరమైన విషయమని ఇటువంటి విషాద సమయంలో కూడా నేత్రదానానికి ముందుకు వచ్చిన వీరి కుటుంబ సభ్యులను చైర్మన్ లయన్ కె వి ప్రసాద్ అభినందిస్తూ వీరి చేసిన ఈ గొప్ప కార్యక్రమానికి ధన్యవాదాలు తెలిపారు.

## గడ్డివాములకు నిప్పు

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మర్రిగూడ గ్రామానికి చెందిన గునుగంటి వెంకటయ్య తన వ్యవసాయ భూమిలో వేసుకున్న రెండు గడ్డివాములను శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. రైతు వెంకటయ్య ఆదివారం తెల్లవారుజామున చూసేసరికి గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయని వీటి విలువ సుమారు లక్ష యాభై వేల రూపాయల వరకు ఉంటుందని రైతు కన్నీటిపర్యంతమయ్యాడు.

## ఆవుల అక్రమ రవాణా కేసు నమోదు

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మల్లెపల్లి నుండి హైదరాబాదుకు బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న ఆవులను మర్రిగూడ మండలం కొండూరు రహదారి వద్ద బిజెపి కార్యకర్తలు అడ్డుకున్నారు. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న హెడ్ కానిస్టేబుల్ రవి నాయక్, హుస్సేన్ లు, కేసు నమోదు చేసి ఆవులను పోలీసుస్టేషన్‌కు తీసుకువెళ్లారు.అనంతరం మునుగోడు లోని సింగారం గోశాలకు పంపించామని ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

## బీచుపల్లి దేవాలయం సందర్శించిన టాస్క్‌ఫోర్స్ ఎస్‌పి

**ప్రజాపక్షం/ఎర్రవల్లి:** ఎర్రవల్లి మండల బీచుపల్లి ఆంజనేయస్వామి దేవాలయాన్ని ఆదివారం టాస్కోర్స్ ఎస్పీ శ్రీనివాస్ సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆయనకు ఆలయ ఈవో రామన్ గౌడ్ అర్చకులు మారుతి ఘనంగా స్వాగతం పలికి దేవాలయంలో అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామివారి శేష వస్త్ర తీర్థప్రసాదాలు అందజేశారు.



## తల్లిదండ్రుల రుణం తీర్చుకోలేనిది



**ప్రజాపక్షం/సూర్యాపేట** : తల్లిదండ్రుల రుణం తీర్చుకోలేనిదని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ అన్నారు.ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జనగాం ఎక్స్ రోడ్డు వద్ద మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ తల్లిదండ్రులు బూర లక్ష్మయ్య గౌడ్, బూర రాజమ్మల జ్ఞాపకార్థం వారి విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడి, తనను చదివించారని, వారి జ్ఞాపకార్థం వారి విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. సమాజానికి సేవ చేయడం ద్వారా వారి ఆశయాలను నెరవేర్చాలని ఆయన ఈ సందర్భంగా అన్నారు.సమాజంలో తమ పిల్లలు ఉన్నత స్థితికి ఎదగాలని ప్రతి ఒక్క తల్లి దండ్రులు ఆకాంక్షిస్తారని, వారి కోరిక తీరే విధంగా పిల్లలు కష్టపడి చదివి జీవితంలో ఉన్న స్థాయికి చేరుకోవాలని, సమాజానికి ఉపయోగ పడే విధంగా వారు ఉత్తమ పౌరులుగా ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, బిజెపి జిల్లా అధ్యక్షురాలు శ్రీలత రెడ్డి, మాజీ అధికార ప్రతినిధి బూర మల్సూరు గౌడ్, బిజెపి నాయకులు కడియం రామచంద్రయ్య,మన్మధ రెడ్డి,చల్లమల్ల నరసింహ,పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## మాదిగ అమరవీరుల ఆశయాలు సాధిద్దాం



**ప్రజాపక్షం/బీబీనగర్** : ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అమరులైన ఉద్యమకారుల ఆశయాలను సాధించాలని ఎమ్మార్పీఎస్ ఉద్యమకారుల పోరాం జిల్లా అధ్యక్షులు చిలకమర్రి గణేష్ మాదిగ అన్నారు. ఆదివారం మండలంలోని కొండమడుగు గ్రామంలో తెలంగాణ ఉద్యమకారుడు మంద మల్లేష్ డప్పు కళాకారుని కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం అమరవీరుల దినోత్సవంగా జరుపుకున్న సందర్భంగా మల్లేష్ కుటుంబాన్ని పరామర్శించి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పిఎస్ నాయకులు ఓట్ల యాదగిరి, ములగరం పాండు, కాడిగళ్ల బాబు, చిన్న లింగం, బొడ్డు నర్సింగ రావు, మంద స్వామి, మంద ఉప్పలయ్య, మంచాల నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## గౌడసంఘం నూతన కార్యవర్గం

**ప్రజాపక్షం/చండూరు:** చండూరు పట్టణంలో ఆదివారం శ్రీ కంఠ మహేశ్వర స్వామి ఆలయం వద్ద గౌడ సంఘం అధ్యక్షుడు బోడ అవకుమార్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా బోడ లవకుమార్ , సంఘం ఉపాధ్యక్షులుగా మొగుదాల పెద్ద దశరథ , నల్ల సత్యనారాయణ, తండు వెంకట్ గౌడ్, బోడ శ్రీను, ప్రధాన కార్యదర్శిగా మొగుదాల శేఖర్ గౌడ్ , కోషాధికారిగా బొల్లేపల్లి రాజు, యూత్ అధ్యక్షుడుగా మొగుదాల ప్రవీన్ గౌడ్ ఎన్నికైయ్యారు. ఈ కార్యక్రమంలో పాలకూరి కిరణ్, శ్రీను, మొగుదాల వెంకటేశం , మాదగోని ఆంజనేయులు , వడ్డెపల్లి గోపాల్ గౌడ్, బోయపల్లి రోషయ్య , చెనగాని పెంటయ్య , బోడ రామలింగం , బిక్షమయ్య , బుచ్చయ్య గౌడ్, అనంత రాములు తదితరులు పాల్గొన్నారు.



# కేంద్రానికి రైతుల పట్ల చిత్తశుద్ధి లేదు



**- యూరియా వెంటనే సరఫరా చేయాలి**
**- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కేంద్ర ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి లేదని, ఆగస్టు నెల వస్తున్నా రైతులకు యూరియా సరఫరా చేయడంలో నిర్లక్ష్యం వహించడం సరికాదని, వెంటనే యూరియా నిల్వలు పంపాలని వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఐడిఓసిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రానికి అదనంగా మూడు లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని కేంద్ర ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డాకు లేఖ రాయనున్నట్లు చెప్పారు. రైతులు యూరియా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్రంలో ఖరీఫ్ పంటల సాగు పెద్దఎత్తున సాగుతోందని చెప్పారు. ఆగస్టు నెలలో యూరియా వినియోగం మూడు మెట్రిక్ టన్నుల వరకు ఉండే అవకాశం ఉందని చెప్పారు. రాష్ట్రంలో 1.16 కోట్ల ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న వంటి ప్రధాన పంటలకు యూరియా ఆవసరం అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1.45 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ మాత్రమే ఉదని, ఏప్రిల్ నుండి జూలై మధ్య కాలంలో 2.37 మెట్రిక్ టన్నుల లోటు నమోదైందన్నారు. దీని వల్ల సాగుకు అంతరాయం ఏర్పడిందని, ఇది దిగుబడిపై ప్రభావం చూప నుందని తెలిపారు. ఇప్పటికైనా యూరియాను సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్, ఖమ్మం ఎంపి రామసహాయం రఘురామిరెడ్డి, పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కార్మికుల పట్ల వివక్ష




**-ఎన్ఆర్‌జిఎస్‌లో పని దినాలలో కోత**
**-వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కర్ణకుమార్**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కార్మికుల పట్ల వివక్ష కొనసాగిస్తున్నాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్దినేని కర్ణకుమార్ ఆరోపించారు. పెరిగిన నిత్యావసర వస్తువులతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే పాలక వర్గాలు కనీసం స్పందించడం లేదని ఆయన ఆరోపించారు. వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా కమిటీ సమావేశం ఆదివారం తాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. సమావేశంలో కర్ణకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్ఆర్‌జిఎస్ పథకంలో పని దినాలకు కోత విధించడమే కాకుండా రోజు వారి వేతనం సైతం గిట్టుబాటు కాకుండా చేస్తుందని ఆరోపించారు. రోజుకు రూ. 600 గిట్టుబాటు అయ్యేవిధంగా కనీసం 250 రోజులు పని దినాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు వ్యవసాయ కార్మికులకు ఆత్మీయ భరోసా క్రింద ఏడాదికి రూ. 12వేలు ఖాతాల్లో జమ చేస్తామని చెప్పిందని ఇటీవల ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సైతం జమ చేస్తున్నట్లు ప్రకటించారని కానీ ఇంత వరకు అమలు కాలేదని ఆయన తెలిపారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని ఇప్పటికే సామాన్యులు బతకలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతు భరోసా మాదిరి కూలీలకు కూడా భరోసా కల్పించే పథకాలు అమలు చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వం హామీల అమలులో విఫలమైతే ఆందోళన తప్పదని హెచ్చరించారు. వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారానికి త్వరలోనే ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కర్ణకుమార్ తెలిపారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కంపసాటి వెంకన్న, మేళ్లచెరువు వీరబాబు, పిట్టల రాంబాబు, సింగారపు సత్యనారాయణ, గోగుల ఆది, జిల్లా నాగరాజు, మందా ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సంఘాన్ని బలోపేతం చేసుకుందాం

**టియుడబ్ల్యుజె(ఐజెయు)**
**జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏనుగు, మైసా**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** జర్నలిస్టుల హక్కుల సాధనకై టియుడబ్ల్యుజె(ఐజెయు) సంఘాన్ని మరింత బలోపేతం చేసుకుందామని ఆ సంఘం జిల్లా నూతనఅధ్యక్షకార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావు అన్నారు. ఆదివారం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లో గల సిపిఐ కార్యాలయంలో వారిరువురికి సంఘం ఖమ్మంరూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు. తొలుత జర్నలిస్టులు బొకేలు,శాలవులతో సత్కరించి స్వీట్స్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నవభూమి రిపోర్టర్ పెరుమాళ్లపల్లి రమేష్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన సభలో వారు మాట్లాడారు...యూనియన్‌కి ఖమ్మంరూరల్ మండలం ఎంతో బలమైన కేంద్రంగా పేర్కొన్నారు. ఈ బలంతో మరింత బలంగా యూనియన్ విస్తరణకు కృషి చేయాలని సంఘం జర్నలిస్టులకు తెలిపారు. జిల్లా కమిటీ నుంచి తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. తమను ఆహ్వానించి సన్మానం చేసిన ఖమ్మంరూరల్ మండల కమిటీకి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జర్నలిస్టులు ఎన్. రంగారావు(మనతెలంగాణ, బి.అశోక్(ప్రజాపక్షం), ఎం లక్ష్మణ్(నమస్తేతెలంగాణ, కె.రఘురాం(విశాలాంధ్ర), స్వరూప్(సూర్య), సురేష్(పోలీసనిఘా), బి.కృష్ణ(విశాలాంధ్ర), బి. రాధాకృష్ణ(ఫాస్ట్‌న్యూస్) పాల్గొన్నారు.

# ఎఐటియుసి పోరాట ఫలితంగానే వేతనాలు విడుదల




**ప్రజాపక్షం/కల్లూరు:** ఆసుపత్రి కార్మికులకు పెండింగ్ వేతనాలు ఏఐటీయూసీ పోరాట ఫలితమేనని విడుదల అయ్యాయని జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు అన్నారు. కల్లూరులో ఆదివారం జరిగిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వారం రోజులు క్రితం రోజువారి విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు చేయడంతో ప్రభుత్వం దృష్టికి తెచ్చిన ఏఐటియుసి పోరాట ఫలితంగా వేతనాలు విడుదల అయ్యాయని వేము రాంబాబు పేర్కొన్నారు. అదేవిధంగా నియోజకవర్గ పరిధిలోని కల్లూరు, సత్తుపల్లి, పెనుబల్లి, ఆసుపత్రిలలో పరిధిలో ఉన్న కార్మికులకు, వేతనాలు విడుదలయ్యాయి. దీనివలన కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ మిఠాయిలు పంచుకుంటూ ఏఐటియుసి నాయకులకు కార్మికులు ధన్యవాదములు తెలిపారు. రాబోయే రోజుల్లో కనీస వేతనం చట్టం అమలుకు ఉద్యమాలు చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తడికమళ్ళ యోబు, దామాల దయాకర్ రావు లతో పాటు కార్మికులు ప్రమోదు, వంశీ ,సత్యవతి, నాగమణి, రమాదేవి, మేరీ సరోజిని, లక్ష్మి ప్రసన్న, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పంట పొలాలను పరిశీలించిన మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని మంత్రి పొంగులేటి స్వగ్రామం నారాయణపురంలో పంట పొలాలను పరిశీలించారు. సొంత పొలాలతోపాటు పరిసర ప్రాంతాలలో పంట పొలాల సాగు విధానం తెలుసుకుంటూ రైతులతో మాట్లాడి వివరాలను అడుగుతున్నారు. ఎన్ని పనులున్నా బిజీగా ఉన్నా కూడా తమ స్వగ్రామంలో ఉన్న తమకు చెందిన పంట పొలాలలో వరి పంటతో పాటు తదితర పంటలు సాగు అవుతున్న విధానాన్ని పరిశీలించారు. విషయం తెలుసుకున్న ప్రజలు అక్కడకు చేరుకొని వారితో మాటామంతి మాట్లాడుకున్నారు. సుమారు ఒక గంట పాటు గ్రామంలో పంట పొలాలను కలియ తిరిగారు. ఆయన వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. చంద్రుపట్ల గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో ఉన్న మాజీ ఎంపీటీసీ కుక్క నాగమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట గ్రామ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

# తెలంగాణలోనూ జర్నలిస్టులకు పింఛన్ సౌకర్యం కల్పించాలి

**-టియుడబ్ల్యుజె (ఐజెయు) డిమాండ్**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణలో జర్నలిస్టులకు ఇతర రాష్ట్రాల మాదిరి పింఛన్ సౌకర్యం కల్పించాలని టియుడబ్ల్యుజె (ఐజెయు) ఖమ్మం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తమిళనాడు, కేరళ, బీహార్ తదితర రాష్ట్రాలు జర్నలిస్టులకు పింఛన్ సౌకర్యాన్ని అమలు చేస్తున్నాయని ఈ క్రమంలోనే బీహార్ ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి పింఛన్‌ను రూ. 15వేలకు పెంచడం పట్ల టియుడబ్ల్యుజె (ఐజెయు) హర్షం వ్యక్తం చేసింది. తెలంగాణలోనూ అర్హత కలిగిన జర్నలిస్టులందరికీ పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరింది. అక్రిడేషన్ల ప్రక్రియ ఆలస్యమవుతుండడంతో హెల్త్ కార్డులపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో క్యాష్‌లెస్ వైద్యం అందించేవిధంగా జర్నలిస్టులకు హెల్త్ కార్డులు జారీ చేయాలని దానితో పాటు ప్రభుత్వమే జర్నలిస్టులకు బీమా సౌకర్యం కల్పించేందుకు ప్రీమియం చెల్లించాలని వెంకటేశ్వరరావు, పాపారావు లు కోరారు. జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను అందించేవిధంగా అన్ని ప్రైవేటు విద్యా సంస్థలకు ప్రభుత్వమే ప్రత్యేక జీవో జారీ చేయాలని వారు కోరారు. త్వరలోనే జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నట్లు వారు తెలిపారు.

# ఉమ్మడి జిల్లాకు 2,646 మెట్రిక్ టన్నుల యూరియా రాక



**ప్రజాపక్షం/చింతకాని :** చింతకాని మండలం పందిళ్లపల్లి రైల్వే రేక్ పాయింట్‌కు ఆదివారం 2646 మెట్రిక్ టన్నుల యూరియాతో రైల్వే వ్యాగన్ వచ్చింది. ఈ యూరియా రాకతో ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులకు ఎంతో ఊరట కల్గించనుంది. వ్యాగన్ల ద్వారా వచ్చిన యూరియాను ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు సంబంధించి మార్క్‌ఫెడ్, ప్రైవేటు డీలర్లకు పంపిణీ చేసినట్లు రాక్ పాయింట్ ఆఫీసర్ పవన్‌కుమార్ తెలిపారు. ఖమ్మం జిల్లాకు 1346 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించగా వాటిలో 868 మెట్రిక్ టన్నులు మార్క్‌ఫెడ్‌కు, 578 మెట్రిక్ టన్నులు ప్రైవేటు డీలర్లకు పంపిణీ చేశారు. భద్రాద్రి జిల్లాకు 1200 మెట్రిక్ టన్నుల యూరియాను పంపగా ఖమ్మం సీఆర్‌పీ పాయింట్‌లో 100 మెట్రిక్ టన్నులను నిల్ల ఉంచారు. వ్యాగన్ నుంచి యూరియా దిగుమతిని రాక్‌పాయింట్ ఆఫీసర్‌తో పాటు సంబంధిత కంపెనీ భాధ్యులు పర్యవేక్షించారు.

# సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



**ప్రజాపక్షం/చింతకాని :** డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సిఫార్సు మేరకు చింతకాని మండలం నేరడ గ్రామానికి చెందిన బత్తుల రాధాకృష్ణకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ.60వేల విలువ గల చెక్కును లబ్దిదారుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, నేరడ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మంకెన నాగేశ్వరరావు, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు వనం చిన్నప్ప, కాంగ్రెస్ నాయకులు చెవుల తిరపతిరావు, సీపీఐ నాయకులు బత్తుల కృష్ణ, గోగుల వెంకట్రావ్, గోగుల వెంకన్న, మక్కల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి మహితారెడ్డికి ఆశీర్వాదం

**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మేజర్ గ్రామపంచాయితీ వీడిసి మాజీ చైర్మన్, బిఆర్ఎస్ జోనల్ చైర్మన్ దగ్గుల శ్రీనివాస్‌రెడ్డి, లలితకుమారి దంపతుల మనువరాలు మహితారెడ్డి అన్నప్రాసన వేడుక ఆదివారం తల్లాడలోని వారి స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు తల్లాడ మాజీ ఎంపిపి దొడ్డ శ్రీనివాసరావు, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి హాజరై చిన్నారికి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి దుగ్గిదేవర వెంకట్‌లాల్, పట్టణ అధ్యక్షులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, జివిఆర్, దగ్గుల నాగిరెడ్డి, కిషోర్‌రెడ్డి, తేల్లూరి రఘు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయంలో నమ్ముకున్న వ్యక్తి లేకపోవడం బాధాకరం

**- జక్కంపూడి ప్రథమ వర్ధంతి సభలో రాష్ట్ర మంత్రి తుమ్మల**



**ప్రజాపక్షం/ తల్లాడ :** 43ఏళ్ల రాజకీయ జీవితంలో నేను కష్టనష్టాల్లో ఉన్నప్పటికీ నన్ను నమ్ముకున్న వ్యక్తిగా సుదీర్ఘకాలం పాటు నా రాజకీయ జీవితంలో నాతో నడిచిన కృష్ణమూర్తి లేకపోవడం తనకెంతో తీరని లోటని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం తల్లాడ మండలంలోని బిల్లుపాడు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు స్వర్గీయ జక్కంపూడి కృష్ణమూర్తి ప్రథమ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి తుమ్మలతో పాటు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తుమ్మల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జక్కంపూడి కుమారుడు కిషోర్ అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ కృష్ణమూర్తి లాంటి స్నేహితులు ఉండటం వల్లే తాను ఈ గ్రామాన్ని మండలాన్ని అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. ఆయనతో పాటు ఈ ప్రాంత ప్రజలు అంటే తనకెంతో నమ్మకమని, ఏ పార్టీలో ఉన్నప్పటికీ తనను ఆశీర్వదించారని అన్నారు. కృష్ణమూర్తి మన మధ్య లేకపోయినప్పటికీ ఆయన చుట్టుపక్కల గ్రామాలకు చేసిన అభివృద్ధి నిరంతరం గుర్తుంటుందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల్లో తన గెలుపుకు కృష్ణమూర్తి అహర్నిశలు శ్రమించారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన లేకపోవడం బాధాకరమని అన్నారు. ఆయన కోరిక మేరకు గ్రామాన్ని, మండలాన్ని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు కాపా సుధాకర్, దగ్గుల రఘుపతిరెడ్డి, దీవెల కృష్ణయ్య, దిరిశాల నర్సింహారావు, సామినేని రామఅప్పారావు, అడపా అనీల్‌చౌదరి, గంగాదేవిపాడు సొసైటీ చైర్మన్ తూము వీరభద్రరావు, బుద్ధిసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంఆర్‌పి కంటే ఎక్కువకు విక్రయిస్తే కఠిన చర్యలు

**-వివి పాలెం సొసైటీని సందర్శించిన ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్**





**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఎరువులను ఎంఆర్‌పి కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేకాధికారి వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్రమోహన్ తెలిపారు. ఆదివారం ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్ వి. వెంకటాయపాలెం సొసైటీని సందర్శించి అక్కడ యూరియా, డిఏపి స్టాక్‌ను పరిశీలించారు. రైతులతో ముచ్చటించారు. యూరియా, ఇతర ఎరువులు సకాలంలో అందుతున్నాయా, సరిపోయినంతా ఇస్తున్నారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీలు, ప్రైవేటు డీలర్లు తప్పనిసరిగా యూరియా, ఇతర ఎరువులకు సంబంధించి స్టాక్ బోర్డును విధిగా షాపు ఎదుట డిస్‌ప్లే చేయాలన్నారు. ఎంఆర్‌పి కంటే ఎక్కువకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు అధైర్యపడవద్దని రాష్ట్రంలో అవసరమైన మేర ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య, వ్యవసాయ సహాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, సొసైటీ ఛైర్మన్, వైస్ ఛైర్మెన్లు రావూరి సైదబాబు, రావెళ్ల శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరరెడ్డి, టెక్నికల్ ఏవో పవన్ కుమార్, ఏఈవో శిరణ్మయి, సొసైటీ కార్యదర్శి ఐతగాని తిరుపతిరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీ కమ్యూనిస్టు సైనికుడిలా పనిచేయాలి

**- యువత ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలి**

**- సిపిఐ నేత బొల్లోజు అయోధ్య**



**ప్రజాపక్షం/అశ్వారావుపేట :** ప్రతీ కమ్యూనిస్టు సైనికునిలాపని చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్ద పీఠ వేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బల్లోజు అయోధ్య అన్నారు. స్థానిక శ్రీశ్రీ ఫక్షన్ హాల్ (మియా జానీ నగర్‌లో) లో భారత కమ్యూనిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 3వ మహాసభల చివరి రోజు అయోధ్య మాట్లాడారు. ఎన్నో ఉద్యమాలు, త్యాగాలతో పునీతమైన పార్టీ సిపిఐ అన్నారు. ఆ నాటి రోజుల్లో పార్టీని విస్తరించే క్రమంలో ప్రాణాలకు సైతం తెగించి పోరాటాలు చేశామని, భూస్వాములు, జమీందార్లకు వ్యతిరేకంగా నిలిచి పేదలకు భూములు పంచామని చెప్పారు. కమ్యూనిస్టు నాయకులు నిబద్ధతో పనిచేయాలని, ప్రజలు వారిసమస్యలు చెప్పుకునేందుకు మనవద్దకు వస్తుంటారని వారి సమస్యల పరిష్కారమయ్యే దిశగా పనిచేయాలన్నారు. 60 శాతం మంది యువత నేడు ఉన్నారని, వారి పెద్ద ఎత్తున ప్రత్యక్ష్య రాజకీయాల్లోకి రావాలని సూచించారు. సిపిఐ నుండి ఎమ్మెల్యే ఉన్నందున ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి నేరుగా తీసుకెళ్లి పరిష్కరించుకుందుకు అవకాశం ఉందన్నారు. జిల్లాలో అపారమైన సహజవనరులు ఉన్నాయని, వాటిని ప్రభుత్వం సద్వినియోగంలోకి తెచ్చి యువతకు ఉపాధి చూపాలన్నారు. సీతారామ ప్రాజెక్టు నీళ్లు జిల్లాలోని సాగుభూములకు కూడా అందించాలని, పారిశ్రామిక ప్రాంతమైన భద్రాద్రి జిల్లాను మరింత తీర్చిదిద్ది దేశంలోనే ఆదర్శంగా నిలపాలన్నారు. రాబోయే ఎన్నికల్లో విజయం సాధించే దిశగా ప్రతీ ఒక్కరు కష్టపడి పనిచేయాలని సూచించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాలవిశ్వనాధంతో పాటు కల్లూరి వెంకటేశ్వరావు, మున్నా లక్ష్మీ కుమారి, జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ సలీం, ఏపి రాష్ట్ర కమిటీ సభ్యులు ఎండి మునీర్, దారయ్య, సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గ సభ్యులు కే సారయ్య, సరెడ్డి పుల్లారెడ్డి, రావులపల్లి రవికుమార్, నరాటి ప్రసాద్ చంద్రా నరేంద్ర, చలిగంటి శ్రీనివాస్, చంద్రగిరి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, దేవరకొండ శంకర్, కమటం వెంకటేశ్వరావు, దుర్గరాశి వెంకన్న, గన్నెని రామకృష్ణ, విజయ్, సాయిబాబు, పూర్ణచంద్రరావు, రాహుల్, హరీష్,అజిత్ తదితరులు పాల్గొన్నారు.

# డెరెక్టర్ బోయపాటిని కలిసిన బాలయ్య అభిమానులు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రముఖ సినీ డైరెక్టర్ బోయపాటి శ్రీనివాస్‌ను ఖమ్మం జిల్లా నందమూరి బాలకృష్ణ అభిమానులు మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. మోతుగూడెంలో అఖండ 2 చిత్రం షూటింగ్ షెడ్యూల్ పూర్తి చేసుకుని హైదరాబాద్ వెళ్తూ మార్గ మధ్యలో ఖమ్మంలో డైరెక్టర్ బోయపాటి శ్రీను ఆగారు. అమ్మ మెస్‌లో బాలయ్య అభిమానులతో కలిసి లంచ్ చేశారు. డైరెక్టర్ బోయపాటి శ్రీను అభిమానులతో కొంత సేపు ముచ్చటించారు. సెప్టెంబర్ 25న అఖండ 2 చిత్రం విడుదల అవుతుందని ఆ రోజు అభిమానులకు, సినీ ప్రేక్షకులకు పండుగ రోజు అని అభిమానులకు బోయపాటి తెలిపారు.ఈ కార్యక్రమంలో నలమల రంజిత్, చంద్రశేఖర్, సాయితేజ, కృష్ణ, కిరణ్, శ్రీధర్, నరేష్, సతీష్, మురళి, మహేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాల్లో సామాజిక వర్గ ప్రస్తావన తగదు

**-కుల విమర్శలు సరికావు**

**ప్రజాపక్షం/ఖమ్మం :** రాజకీయాల్లో సైద్ధాంతిక, పాలన పరమైన విమర్శలతో ఎటువంటి ఇబ్బంది లేదని కానీ సామాజిక వర్గ ప్రస్థావనతో కూడిన విమర్శలు ఇబ్బందికరమని ఇటువంటి విమర్శలు చేసే ముందు రాజకీయ నేతలు ఆలోచించాలని కమ్మ మహాజన సంఘం ఖమ్మం జిల్లా కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఒక సామాజిక వర్గాన్ని ముఖ్యంగా కమ్మ కులం పట్ల కొందరు దుర్మార్గమైన వ్యాఖ్యలు చేసినట్లు సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతుందని ఇది అత్యంత బాధాకరమని కమిటీ తెలిపింది. బిఆర్‌ఎస్ నేతలు చేసినట్లు ప్రచారం జరుగుతున్న ఈ వ్యాఖ్యలను కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని ఇతరుల మనోభావాలను గాయపరిచేవిధంగా విజ్ఞత కలిగిన రాజకీయ నేతలు మాట్లాడటం సరి కాదన్నారు. కమ్మ కులం ప్రగతికి దోహదపడిందని సామాజిక చైతన్యం, ఆర్థికాభివృద్ధి, విద్య, వైద్య రంగాల పురోభివృద్ధికి దోహదపడిందని రాజకీయాల్లో సైతం కమ్మ కులానికి చెందిన పలువురు నిస్వార్థ సేవలు అందించారని ఈ సందర్భంగా జిల్లా కమిటీ గుర్తుచేసింది. రాజకీయాల్లో వ్యక్తిగత విమర్శలు, కులాలపై వ్యాఖ్యలు ప్రమాదకరమని కమ్మ కులాన్ని చిన్నచూపు చూసే ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నామని కమిటీ తెలిపింది. ప్రకటన విడుదల చేసిన వారిలో జిల్లా అధ్యక్షులు కొల్లు రఘు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి చావా రాము, కోశాధికారి తుళ్లూరి నిర్మల కుమారి, పలువురు సంఘ బాధ్యులు ఉన్నారు.

# అభివృద్ధి పథంలో భద్రాద్రి బ్యాంక్

**-ఘనంగా భద్రాద్రి బ్యాంక్ 28వ మహాజన సభ**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సభ్యులు, పాలక వర్గ సహకారంతో భద్రాద్రి బ్యాంక్ అభివృద్ధి పథంలో పయనిస్తూ శాఖోప శాఖలుగా విస్తరిస్తుందని ఛైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి తెలిపారు. భద్రాద్రి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 28వ మహాజన సభ ఆదివారం ఖమ్మం నగరంలోని డాబాల బజార్‌లో గల వాసవి కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది. ఈ మహాసభకు బ్యాంక్ ఛైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి నామవరపు రాజేశ్వరరావు, విశిష్ట అతిథిగా జిల్లా సహకార శాఖాధికారి గట్టు గంగాధర్ హాజరయ్యారు. బ్యాంక్ ఛైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి 2024 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్షిక నివేదికను, 2025 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌ను సభ్యుల ముందు ప్రవేశపెట్టి ఆమోదం పొందారు. గత 28 సంవత్సరాలుగా బ్యాంకు ఎలా అభివృద్ధి పథంలో నడుస్తుందో సభ్యులకు వివరించారు. 2024 25 ఆర్థిక సంవత్సరం ముగిసిన మార్చి 31 నాటికి డిపాజిట్లు రూ. 598.96 కోట్లు, రుణాలు రూ. 365.99 కోట్లు, బ్యాంకు నికర లాభం రూ. 880.31 లక్షలుగా ఉందని తెలిపారు. బ్యాంకు ప్రారంభం నుండి రుణ వితరణే కాకుండా ఇచ్చిన రుణాలను వసూలు చేయడంలోనూ బ్యాంకు ముందుందన్నారు. బ్యాంకు యొక్క నిరర్థక ఆస్తుల శాతం ఎప్పుడు నిల్‌గానే ఉందన్నారు. ఈ ఏడాది నాలుగు కొత్త శాఖలు, ఏప్రిల్‌లో రెండు శాఖలు ప్రారంభించి ఇప్పటి వరకు 23 శాఖలుగా విస్తరించిందని రాబోయే రోజుల్లో మరిన్ని శాఖలను ప్రారంభిస్తామని తెలిపారు. త్వరలో మల్టీస్టేట్ కో ఆపరేటివ్ బ్యాంక్‌గా అనుమతులు పొంది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా బ్రాంచీలు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. మొత్తం 23,537 మంది సభ్యులు ఉన్నారన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి నామవరపు రాజేశ్వరరావు మాట్లాడుతూ భద్రాద్రి బ్యాంక్ క్రమశిక్షణతో అంచలంచెలుగా ఎదుగుతూ రాష్ట్రంలోని అర్బన్ బ్యాంకులలో అగ్రగామిగా ఎదిగిందన్నారు. బ్యాంకు ఛైర్మన్, ఇతర పాలక వర్గ సభ్యులు సక్రమమైన చర్యలు సకాలంలో తీసుకుంటూ వాటిని సిబ్బంది సక్రమంగా ఖాతాదారులకు అందించడంతో భద్రాద్రి బ్యాంక్ విజయపరంపర కొనసాగుతుందని ఆయన అభినందించారు. జిల్లా సహకార శాఖాధికారి గంగాధర్ మాట్లాడుతూ భద్రాద్రి బ్యాంక్ ఖమ్మం జిల్లాకే తలమానికంగా నిలిచిందన్నారు. 1997 అక్టోబర్ నాలుగున ప్రారంభమైన బ్యాంక్ అంచలంచెలుగా ఎదుగుతూ 23 శాఖలుగా విస్తరించిందన్నారు. వైస్ ఛైర్మెన్లు సన్నె ఉదయ్‌ప్రతాప్, వేములపల్లి వెంకటేశ్వరరావు, బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణాధికారి దాసరి వేణుగోపాల్ తదితరులు ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు దేవతా రాజారావు, బులుసు సాంబమూర్తి, మద్ది పిచ్చయ్య, రాజ్‌పురోహిత్ చైన్ సింగ్, వైవిఎస్ రావు, రంగా నాగ శ్రీనివాసరావు, దారా జీవన్‌రామ్, కర్లపూడి నర్మద, కపిలవాయి జయప్రద, సభ్యులు సిజి శాస్త్రి, పైడిమర్రి సత్యనారాయణ, పసుమర్తి మధుసూధన్‌రావు, మేనేజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి యోగాసనాల పోటీల్లో మణుగూరు విద్యార్థుల విజయభేరి




**ప్రజాపక్షం/మణుగూరుః** జిల్లా కేంద్రం లోని హనుమాన్ కమ్యూనిటీ హాల్ లో నిర్వహించినా పోటీలలో అండర్ 14 విభాగంలో ట్రెడిషినల్ యోగాసనాల పోటీలో మొదటి బహుమతి వల్లేపు వంశీ ఏడవ బి రెండవ బహుమతి జి తరుణ్ , కొత్తపల్లి కౌశిక్ మూడవ బహుమతి పాయలీ శివకుమార్ రిథయెమిక్ యోగాసనాల మొదటి బహుమతి కొత్తపల్లి కౌశిక్ పాయలి, శివకుమార్ రెండవ మూడవ బహుమతి గంగాధర శ్రీరామ్ వల్లేపు వంశీ, ఫర్వాడ్ బెండ్ మొదటి బహుమతి ఆత్మకూరి సాత్విక్ 6వ గెలుచుకున్నారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ముంజాల సురేష్ మాట్లాడుతూ పోటీలలో పాల్గొన్న అన్ని విభాగాలలో విజేతలు గా నిలవడం ఆనందంగా ఉందన్నారు. వచ్చే నెల రాష్ట్ర స్థాయి యోగాసనా పోటీల్లో విజేతలు గా నిలవడం కొరకు మరింత ఉత్సహంతో ప్రయత్నం చేస్తామన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ రజనీ విద్యార్థులు రాష్ట్ర స్థాయి యోగాసనా పోటీలకు ఎంపిక కావడం చాలా ఆనందన్నీ వ్యక్తం చేశారు. మా పాఠశాలలో యోగాకు సమయాన్ని కేటాయించి పోటీలకు సిద్ధం చెయ్యడం జరుగుతుందని, దీని వలన విద్యార్థులలో శారీరకంగా మానసికంగా ధృడంగా తయారు చేయడానికి యోగా ఉపయోగ పడుతుందని తెలిపారు.